సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 18 । డిసెంబర్ । 2024



పోలీస్ స్పోర్ట్స్‌మీట్

పోలీస్ స్పోర్ట్స్‌మీట్ ఉత్సాహంగా జరిగింది. పోలీసులు సందడి చేశారు.

- 8లో



బూడిదే మిగిలింది

అంబటి ఎరుకువానిపేటలో అగ్ని ప్రమాదం జరిగింది. వరి చేను దగ్ధమైంది.

- 8లో

● ఇటు చినుకు.. అటు వణుకు

అగ్గి మంటలు రాజుకుంటున్నాయి. 'హు..హు..హు' రాగాలు జిల్లా అంతటా వినిపిస్తున్నాయి. ఊళ్లను చలిగాలులు వణికించేస్తున్నాయి. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. దీనికి తోడు మబ్బు పట్టడంతో వాతావరణం శీతలంగా మారిపోయింది. మంగళవారం అక్కడక్కడా చిరుజల్లులు కూడా కురిశాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



శ్రీకాకుళంలో వానలో రాకపోకలు







జిల్లా కేంద్రంలో మంట వద్ద చలి కాచుకుంటున్న దృశ్యం



చలిలోనే పోలీసు విధి నిర్వహణ

న్యూస్‌రీల్

కవిటి హెచ్‌ఎం, ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

శ్రీకాకుళం న్యూకాలనీ,కవిటి: జిల్లాలోని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావుతోపాటు అదే మండలంలోని కవిటి జెడ్పీహెచ్‌స్కూల్ (ఒరియా) ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్)కు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య షోకాజ్‌లు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లిప్తత, పర్యవేక్షణ లోపం, పాఠశాల అసెంబ్లీ, 100 రోజుల ప్రణాళిక అమలు కాకపోవడం, పాఠశాలలో విద్యాసంబంధిత ఇతర కార్యక్రమాల అమలు చేయకపోవడం తదితర కారణాలతో కవిటి జీహెచ్‌స్కూల్ హెచ్‌ఎం బెందాళం మల్లేశ్వరరావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే అదే మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కవిటిలో సమయపాలన పాటించక, విధి నిర్వహణలో ఉదాసీనత కారణంగా ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు/పీజీటీ/జేఎల్‌లు కింగర ప్రేమలత (ఫిజికల్ సైన్స్), లిమ్మ సూరజ్ సుందర్ (మాథమేటిక్స్), ఎర్ర బాలరాజు (ఇంగ్లీషు)లకు జిల్లా విద్యాశాఖాధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హెచ్‌ఎంకు 2 రోజుల్లో, స్కూల్ అసిస్టెంట్ల నుంచి 3 రోజుల్లోగా లిఖిత పూర్వకమైన వివరణ కోరారు. వారి వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సఫాయి కర్మచారుల సంక్షేమంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పీపీ వావా

శ్రీకాకుళం పాతబస్టాండ్: సఫాయి కర్మచారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సక్రమంగా అమలు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పీపీ వావా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, సఫాయి కార్మికులు, ఆయా సంఘాల ప్రతినిధులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సఫాయి కర్మచారులు అందించే సేవలు అమూల్యమైనవని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరికి కనీస వేతనాలు దక్కేలా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో కర్మచారులను నియమించి వారికి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన జిల్లాలో సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి వచ్చిన సఫాయి కర్మచారుల సంఘం ప్రతినిధులు తమకు రుణాలు, ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సఫాయి కర్మచారుల విజ్ఞప్తులపై యంత్రాంగం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ క్రీడాపోటీలు



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో ఆర్‌ఎండ్‌ఆర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దామోదర పద్మ(35)ను హత్య చేసి పరారైన అదే గ్రామానికి చెందిన సాండి సురేష్‌ను ఆమదాలవలస పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కాలనీలోని అమ్మవారి ఆలయం సమీపంలో ఓ ఇంటిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సుమారు 30 మంది సిబ్బంది వెళ్లి నిందితుడిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.వెంకటేష్ వద్ద ప్రస్తావించగా నిందితుడు తమ అదుపులోనే ఉన్నాడని, ఇంకా అరెస్ట్ చేయలేదని, విచారణ చేస్తున్నామని చెప్పారు.

ప్రొటోకాల్ బండి.. అన్నీ అక్రమాలేనండి!

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి జిల్లా యంత్రాంగం కేటాయించిన ప్రొటోకాల్ వాహనమిది. ఏపీ 39ఎక్స్ 6తో పాటు ఏపీ 30ఏజీ 0369వాహనం కూడా కేంద్రమంత్రికి కేటాయించారు. బాలాజీ ట్రావెల్స్‌కు చెందిన ఈ వాహనాలు ఎంత దూరం ప్రయాణించిందీ ఓ లాగ్‌బుక్‌లో నమోదు చేస్తారు. దాని ప్రకారం అద్దె చెల్లిస్తారు. వాహనం తిరిగితే డీజిల్ వినియోగంతో కూడిన బిల్లు చెల్లించాలి. తిరగకుండా మంత్రి దగ్గరే ఉంటే అద్దె మాత్రమే చెల్లించాలి. ఇదే బండి జాతీయ సఫాయి కార్మికుల కమిషన్ సభ్యులు పి.పి.వావా అనే అధికారికి కేటాయించడం కలకలం రేపుతోంది.



- కేంద్రమంత్రికి కేటాయించిన వాహనాన్ని వేరొకరికి అద్దెకిచ్చిన బాలాజీ ట్రావెల్స్
- రెండు విధాలుగా బిల్లు చేసుకునే అవకాశం ఉందని ఆరోపణలు
- గతంలోనూ అద్దె వాహనాల అవకతవకలు
- అక్రమాలు జరిగాయని గుర్తించిన అప్పటి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- సుమారు రూ. 65లక్షల వరకు బిల్లులు నిలిపివేత
- తాజా పరిణామంపై కలెక్టర్, జేసీకి ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ప్రొటోకాల్ బండితో రెండు బిల్లులు కాజేసే అక్రమం బట్టబయలైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర మంత్రికి కేటాయించిన ఏపీ 39ఎక్స్ 6 వాహనాన్ని సోమవారం, మంగళవారం జాతీయ సఫాయి కార్మికుల కమిషన్ సభ్యులు పి.పి.వావా అనే అధికారికి పెట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బాలాజీ ట్రావెల్స్ నుంచే ఈ వాహనాన్ని అద్దెకు తీసుకుని పెట్టారు. అంటే ఒకే వాహనాన్ని అటు కేంద్రమంత్రికి, ఇటు జాతీయ సఫాయి కార్మికుల మిషన్ సభ్యులకు కేటాయించారు. అది కూడా ఒకే రోజులో. దీని ద్వారా రెండు సార్లు బిల్లు చేసుకునే అవకాశం ఉంటుంది. నిబంధనల ప్రకారం ఇది అక్రమమే. ప్రొటోకాల్ ప్రకారం వాహనం కేటాయించాక అది ఖాళీగా ఉన్నా సరే అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చాకే మరొకరికి కేటాయించాలి. కేంద్రమంత్రి రక్షణ దృష్ట్యా ఆ వాహనాన్ని ఒకరికే పరిమితం చేయాలి. ఒకసారి బయటికి వెళ్తే సెక్యూరిటీ పరమైన లోపాలు చోటుచేసుకునే అవకాశం కూడా ఉంది. దీంతో ఈ వైఖరి ఇప్పుడు చర్చనీయాంశమైంది.

ఎప్పటి నుంచో ఆరోపణలు..

ప్రొటోకాల్ వాహనాలను చాలా ఏళ్ల నుంచి బాలాజీ ట్రావెల్స్‌కు సంబంధించినవే పెడుతున్నారు. వీటి వినియోగంపై ఆరోపణలు ఉన్నాయి. వాహనాలు తిరగకపోయినా డీజిల్‌తో పాటు అద్దె బిల్లు పెడుతున్నారనే వాదనలు ఉన్నాయి. కేంద్రమంత్రులకైతే రెండు, జిల్లా మంత్రులకైతే ఒక ప్రొటోకాల్ వాహనం పెడుతున్నారు. ఇవి కాకుండా వీఐపీల పర్యటనలో అదనంగా బాలాజీ ట్రావెల్స్‌తో పాటు మరికొన్ని ట్రావెల్స్ నుంచి అద్దెకు వాహనాలు పెడుతున్నారు. ముఖ్యంగా ప్రొటోకాల్ కింద పెట్టిన వాహనాల వినియోగంలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో బాలాజీ ట్రావెల్స్ బిల్లుల విషయంలో వివాదం చోటు చేసుకుంది. అప్పట్లో కలెక్టర్‌గా శ్రీకేష్ బాలాజీ లాఠ్కర్ పనిచేసినప్పుడు బిల్లుల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో సుమారు రూ.65లక్షల బిల్లులు బాలాజీ ట్రావెల్స్‌కు చెల్లించకుండా ఆపేశారు. దీనిపై కోర్టుకు కూడా వెళ్లారు. కానీ చెల్లింపులు జరగలేదు. మూడు బృందాలతో అప్పట్లో బిల్లులు విచారణ జరిపించినట్టు సమాచారం. డబుల్ ఎంట్రీ, జీఓలో లేని విధంగా, ఇష్టారీతిన బిల్లులు రాసేశారని గుర్తించినట్టు సమాచారం. ఈ బిల్లులు చెల్లించాలని శ్రీకేష్ బి.లాఠకర్ తర్వాత వచ్చిన ప్రతి కలెక్టర్‌ను ఒత్తిడి చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు. ప్రస్తుత కలెక్టర్‌పై కూడా బిల్లులు చెల్లించాలని ఓ రాజకీయ ప్రముఖుడితో ఒత్తిడి చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాట్సాప్ ద్వారా ఫిర్యాదు

కేంద్ర మంత్రికి కేటాయించిన ఏపీ39ఎక్స్ 6 నంబర్ గల వాహనాన్ని మున్సిపల్ కార్పొరేషన్‌కు అద్దెకిచ్చినట్టు, దానికి సంబంధించిన ఫొటోలతో సహా ప్రస్తుత కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఒకరు ఫిర్యాదు చేశారు. దానిపై కలెక్టర్ కూడా 'ఓకే' అని స్పందించారు. అలాగే, జాయింట్ కలెక్టర్‌కు కూడా వాట్సాప్ లోనే ఫొటోలతో సహా ఫిర్యాదు చేయగా, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని స్పందించారు. ఈ పరిణామంపై కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.చక్రవర్తిని వివరణ కోరగా నెలకు సంబంధించి లాగ్‌బుక్ సమర్పించిన తర్వాత మాత్రమే ఏం జరిగిందో గుర్తించగలమని చెప్పారు.

ఎగ్‌బాకుతున్న ధర



సర్వకాల సర్వావస్థల్లో పేదవాడికి అందుబాటులో ఉండే గుడ్డు ఇప్పుడు క్రమేపీ ఆ వర్గానికి దూరమవుతోంది. గత నెలలో సుమారు రూ.6 ఉన్న ఒక కోడి గుడ్డు ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.8కు పెరిగిపోయింది. ధనుర్మాసంలో కూడా గుడ్డు ధర ఇంతలా పెరిగిపోవడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. జూలైలో రూ.5.50 ఉన్న గుడ్డు ధర ఇప్పుడు రూ.8 అయింది. వేసవికి ముందే ఒక గుడ్డు ధర రూ.10లకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పాలనలో అన్ని ధరలు పెరిగిపోవటంతో కోడి గుడ్డు ధర పెంచక తప్పటం లేదని కోళ్ల ఫారం యజమానులు చెబుతున్నారు. కోళ్లకు ఉపయోగించే మేత ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మరోవైపు గుడ్లు రవాణా చేసే వాహనాల డీజిల్ ధరలు, కోళ్ల ఫారంలో పనిచేసే కూలీల ధరలు, విద్యుత్ చార్జీలు పెరిగాయి. నిర్వహణ భారం తట్టుకోలేక చాలా మంది ఈ వ్యాపారం నుంచి తప్పుకుంటున్నారు. దీంతో ఉత్పత్తి తగ్గి ధర పెరుగుతోంది.

–ఎల్ఎన్ పేట

కొనలేం.. తినలేం..



గత నెల రోజుల్లో గుడ్డు ధర బాగా పెరిగింది. కొన్ని రోజుల కిందటి వరకు ఒక గుడ్డు ధర రూ.6లు ఉండేది. ఇప్పుడు ఒక గుడ్డు ధర రూ.8 అయింది. ఇలా ధరలు పెరిగిపోతే పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు గుడ్డు కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడింది.

– చింతాడ కృష్ణవేణి, గృహిణి, తురకపేట, ఎల్.ఎన్.పేట

క్రైమ్ పెరుగుతోంది



- బాలికలపై దాడులు, అత్యాచారాలు నమోదవుతున్నాయి
- డ్రగ్స్, గంజాయిపైనా ఫిర్యాదులు వస్తున్నాయి
- పోలీసులు అప్రమత్తంగా ఉండాలి
- డీఐజీ గోపీనాథ్ జెట్టీ

సమావేశానికి హాజరైన మహిళా పోలీసులు



(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్ : క్రైమ్ రేటు విపరీతంగా పెరుగుతోందని, శాంతిభద్రతలు పరిరక్షించేందుకు పోలీసులు చురుగ్గా పనిచేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా డీఐజీ మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లో ముఖ్య రికార్డులు, అన్ని రకాల కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దర్యాప్తు ఎలా ఉన్నదీ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ సీహెచ్ వివేకానంద సమక్షంలో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఎం.హరికృష్ణలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ ఆధ్వర్యంలో మహిళా పోలీసులతో ముఖాముఖి మాట్లాడారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఎక్కువ ఫిర్యాదులు

కళాశాలలు, స్కూళ్లలో గంజాయి, డ్రగ్స్ వాడకం ఎక్కువ అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఒడిశా నుంచే కాక మన ఆంధ్రాలోని కొన్ని మార్గాల్లో సైతం రవాణా చేస్తున్నారని అన్నారు. వాటి మూలాలు తెలుసుకోవాలని సూచించారు. దీనిపై మహిళా పోలీసులు సమస్యలు చెప్పగా.. సమాచారం ఉంటే ఎస్పీని నేరుగా సంప్రదించాలన్నారు. 100, 112, 1972ల ద్వారా ఎవరు సమాచారం ఇచ్చినా వారి వివరాలు తెలిసే అవకాశం లేదన్నారు. చిన్నారులు, మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలో ఇప్పటికే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు.

జిల్లాలో 19 కీలక సైబర్ కేసులు

లోన్‌యాప్‌లు, ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్, యూట్యూబ్ వేదికగా జాబ్‌లిప్పిస్తామని, డిజిటల్ అరెస్టు, ఓటీపీ లింక్, కష్టపడకుండా డబ్బులు సంపాదించే డిజిటల్ అరాచకాలు పెచ్చుమీరిపోతున్నాయని డీఐజీ అన్నారు. ఇప్పటికే 19 కేసులు నమోదయ్యాయని దీనికి మూడింతలు ఫిర్యాదులు అందనివి ఉంటాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని, సైబర్ నేరానికి గురైతే 1930కు ఫోన్‌చేయాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. రేంజి పరిధిలో 41 ఎకరాల గంజాయి (అల్లూరి సీతారామరాజు జిల్లా) సాగు గుర్తించడం జరిగిందని, క్రయ విక్రయాలు, రవాణా నిర్మూలించేందుకు టెక్నాలజీ సాయంతో (డ్రోన్లు, సీసీ కెమెరాలు, జాగిలాలు) నిఘా పెట్టామన్నారు. ఇటీవల వార్తల్లో ఉన్న పలాసలో పెరిగిన రౌడీయిజం, పక్కరాష్ట్రాల నుంచి సుపారీ గ్యాంగు రావడం, నకిలీ నోట్ల ముఠా నాయకుని పట్టుకోవడానికి రాజమండ్రి వెళ్లిన మన పోలీసులను అక్కడివారు దాడి చేయడం, జిల్లాకేంద్రంలో ఆర్మీ కాలింగ్ వ్యవహారం మహిళల మెడల్లో గొలుసులు తెంపేసి దాడులకు పాల్పడటం వంటి అంశాలపై ఇప్పటికే ఎస్పీ విచారణ చేయిస్తున్నారని తెలిపారు.

● పురాతన మందిరం..



సెయింట్ థామస్ చర్చి

జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్ రోడ్డులో ఉన్న పురాతన చర్చి పునీత తోమాను దేవాలయం. దీన్ని 1845లో కట్టారు. అడ్డగట్ల ఇన్నయ్య ఇక్కడ మొదటి ఫాదర్‌గా వ్యవహరించారు. 1999లో దీన్ని పునరుద్ధరించారు. దీనిలో ఆరోగ్య మాత మందిరం ఉంది. వెయ్యిమంది ఒకేసారి ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా పెద్ద హాలు ఉంది. ఈ చర్చికి ఫాదర్‌గా బోనెల రాజు బైబిల్ ప్రవచనాలు, ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా కేరల్స్‌ను ఈనెల 15 నుంచి 23 వరకు నిర్వహిస్తారు. 24 రాత్రి 11గంటల నుంచి 2గంటల వరకు క్రీస్తు పుట్టిన వేడుకలు జరుగుతాయని, 25 ఉదయం 10గంటలనుంచి కూడా ప్రార్థనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

-శ్రీకాకుళం కల్చరల్

4 రోజులు జాగ్రత్త



- నేటి నుంచి వానలు పడే అవకాశం
- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందని, రైతులు ఖరీఫ్ వరి పంట, ధాన్యంను జాగ్రత్త చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో నూర్పులు పూర్తయి ధాన్యం, సేకరణ కేంద్రాలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు ప్రతి మండలంలో 100 టార్పాలిన్లు తహసీల్దార్ ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరం తీరిపోయాక టార్పాలిన్లు వాపసు చేయవచ్చని, రూ.650 చెల్లించి తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయం, లేదా రైతు సేవా కేంద్రాల ద్వారా వీటిని తీసుకోవచ్చన్నారు.



ఇచ్ఛాపురం రూరల్ : బూర్జపాడులో ట్రాక్టర్లపై వరిచేను తీసుకెళ్తున్న దృశ్యం

19న అప్రెంటిస్ షిప్ మేళా



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డీఎల్‌టీసీ–ఐటీఐ)లో ఈనెల 19వ తేదీన అప్రెంటిస్‌షిప్ మేళా జరగనుందని డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్‌మోహనరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ డీఎల్‌టీసీ వేదికగా మేధా సెర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, హైదరాబాద్ వారి ద్వారా నిర్వహించే ఈ మేళాకు ఐటీఐలో ఎంపికచేసిన ట్రేడుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడుల్లో ఉత్తీర్ణులై 25 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు రావాలన్నారు. మేళాకు హాజరైన అభ్యర్థులకు లిఖితపూర్వక పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేస్తారని ఏడీ రామ్‌మోహనరావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15100 స్టైఫండ్‌తోపాటు ఈఎస్ఐ, కంపెనీ ఇతర అలవెన్సులు, సదుపాయాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలని ఆయన కోరారు.



వై. రామ్‌మోహన్‌రావు

క్లుప్తంగా

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సంకల్ప్ ప్రాజెక్టులో భాగంగా 50 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాపారం ప్రారంభం, పరిశ్రమలకు అనుమతులు, బ్యాంక్ సహాయం, ముద్ర రుణాలు, పీఎంఈజీపీ రుణం వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 79891 77887 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆ మృతదేహం ఎవరిదో?


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం కొబ్బరితూరు జాతీయ రహదారి పక్కన బస్టాండ్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 50 ఏళ్ల వయసు కలిగి కుడిచేతిపై గుర్తు పట్టలేని భాషలో పచ్చబొట్లు ఉన్నాయి. దుస్తులపై క్లీన్ టీడబ్ల్యూ టైలర్స్ సలీమ్ అని రాసి ఉంది. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 6309990825 నంబరుకు సంప్రదించాలని కాశీబుగ్గ పోలీసులు పేర్కొన్నారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న సంపూర్ణేష్‌బాబు


సంపూర్ణేష్‌బాబుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

గార/అరసవల్లి: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించగా.. ఈవో జి.గురునాధరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేసారు. అంతకుముందు అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కూడా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు

19న ఫెన్సింగ్ క్రీడాకారుల నమోదు

శ్రీకాకుళం న్యూకాలనీ : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారులు ఈ నెల 19న జరిగే ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్‌లో భాగస్వామ్యం కావాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా మంగళవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా జరిగే ఈ పోటీలకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు కలిగిన క్రీడాకారులు ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ (సెల్: 7660874844)ను సంప్రదించాలన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు పలాస విద్యార్థి


తిరుమల

కాశీబుగ్గ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పలాస హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బడే తిరుమల ఎంపికయ్యాడని హెచ్ఎం దాశరథ తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలను ఉపాధ్యాయులు పట్ట తవిటయ్య, శంకరరావు, శ్రీనివాసరావు, చిట్టిబాబు మంగళవారం అభినందించారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రతిజ్ఞ



ఈగల్ టాస్క్‌ఫోర్స్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, డీఐజీ, ఎస్పీ, పోలీసు అధికారులు



డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- 'సంకల్పం' కార్యక్రమంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఎచ్చెర్ల క్యాంపస్: డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) రహిత సమాజం లక్ష్యంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మంగళవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంకల్పంలో భాగంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో ఒకరు డ్రగ్స్‌కు బానిసైనా కుటుంబం మొత్తంపై ప్రభావం చూపుతుందన్నారు. కళాశాలలు, విద్యా సంస్థలు యాంటీ డ్రగ్స్ స్క్వాడ్‌లు నిర్వహించాలని, ఎటువంటి డ్రగ్స్ అమ్మకాలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కొని విలువైన జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం ఈగల్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్లాష్ మాబ్స్, స్కిట్లు అలరించాయి. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆర్‌జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, అదనపు ఎస్పీ కేవీ రమణ, శివానీ కళాశాల యాజమాన్య సభ్యులు దుర్గా శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌రాజు, సనపల శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, ఇమ్మాన్యుయేల్‌రాజు, ఈశ్వరరావు, పైడపు నాయుడు, ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

మేస్త్రి కుమారుడికి ఒకేసారి మూడు ఉద్యోగాలు


గణేష్‌తో తల్లిదండ్రులు రాము, ప్రమీళ

టెక్కలి: భవన నిర్మాణ మేస్త్రి కుమారుడు ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. టెక్కలి ఎన్టీఆర్ కాలనీకు చెందిన పైల రాము, ప్రమీళ దంపతుల పెద్ద కుమారుడు పైల గణేష్ సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌సీ జీడీ, ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్ తదితర ఉద్యోగాలకు ఒకేసారి ఎంపికయ్యాడు. ఏడాది క్రితం సీఆర్‌పీఎఫ్ ట్రేడ్, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్ఎస్‌సీ జీడీ, జూన్‌లో ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్ తదితర ఉద్యోగాల ఎంపికలకు హాజరయ్యాడు. అన్ని పరీక్షలఫలితాలు ఒకేసారి విడుదల కావడం.. అన్నిట్లో గణేష్ ఉద్యోగాలు సాధించడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సందర్భంగా గణేష్ కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు అభినందించారు.

సైనిక కుటుంబాలకు సాయం


సాయం అందిస్తున్న సైనిక సంక్షేమ అధికారి, ప్రతినిధులు

పలాస: సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తెలుకల శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సైనిక సంక్షేమ డైరెక్టర్, బ్రిగేడియర్ వెంకటరెడ్డి, శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ మంగళవారం సైనిక సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయలు చెక్ అందజేశారు. నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన ఆర్మీ జవాన్ సనపల జగదీశ్వరరావు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కూడా రూ.లక్ష చెక్ అందజేశారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు ఇళ్ల మన్మధరావు, ఉపాధ్యక్షులు బంగారు బారికి, కార్యదర్శి ఇప్పిలి తాతయ్య, డొంకాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపసోపాల నడుమ అర్ధ సంవత్సర పరీక్షలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అర్ధసంవత్సర పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అన్ని యాజమాన్య జూనియర్ కాలేజీల్లో తొలిరోజు తెలుగు/సంస్కృతం/హిందీ పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో పరీక్షలు కొనసాగుతున్నప్పటికీ సకాలంలో విద్యార్థులకు పేపర్లు చేరవేయలేక ప్రిన్సిపాళ్లు ఆపసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ కాలేజీల్లో ప్రశ్నపత్రాలు విద్యార్థులకు అందజేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


భవాని(ఫైల్)

నరసన్నపేట: స్థానిక జోగిపేటకూడలికి చెందిన నారాయణశెట్టి భవాని (35) చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది. భర్త శ్రీధర్‌తో కలిసి ఆదివారం పోలాకి మండలం రాజారాంపురంలో వన భోజనానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా పోలాకి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన భవానీని రిమ్స్‌లో చేర్పించగా పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు పిల్లలు. పోలాకి పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి


ఎర్రయ్య(ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని ముద్దాడపేటకు చెందిన లాస ఎర్రయ్య(40) శనివారం మధ్యాహ్నం ఆమదాలవలస నుంచి తన ఇంటికి వెళుతుండగా తమ్మయ్యపేట సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. 108 అంబులెన్సులో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. మృతుడికి భార్య దుర్గ, కుమార్తె జస్మిత, కుమారుడు జ్ఞానేశ్వర్ ఉన్నారు.

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024

- ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో పోటీలను ప్రారంభించిన డీఐజీ గోపీనాథ్ జెట్టి
- మూడు రోజుల పాటు జరగనున్న క్రీడలు


మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు, వందనం చేస్తున్న అధికారులు


టగ్ ఆఫ్ వార్ పోటీలో క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్:

పోలీసులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో మూడు రోజుల పాటు కొనసాగనున్న పోలీస్ స్పోర్ట్సు మీట్–2024 పోటీలను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. గౌరవ వందనం స్వీకరించిన అధికారులు క్రీడాజ్యోతి వెలగించారు. అనంతరం టగ్ ఆఫ్ వార్, 100, 800 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. పోలీసులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ, క్రీడా పతకాలను ఎగుర వేశారు.

పోలీసులకు దేహదారుఢ్యం తప్పనిసరి..

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీసులకు దేహ దారుఢ్యం కీలకమనిచెప్పారు. క్రీడలతో ఆరోగ్యం చేకూరడంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. తమకు నచ్చిన క్రీడల్లో ప్రతిఒక్కరూ పాల్గొని మెరుగైన ప్రదర్శన చేయాలని కోరారు. నిరంతరం ఒత్తిడితో ఉద్యోగాలు చేసే పోలీసులంతా ఈ మూడు రోజులూ మైదానంలో ఆనందంగా ముందుకు సాగాలన్నారు. పోలీసు వృత్తిలో ఉన్న వారు వ్యక్తిగత క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాయామంపై దృష్టి సారించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా పోరాడాలన్నారు. కాగా, శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ పోలీసులు, ఆర్మ్‌డు రిజర్వు, హోంగార్డు విభాగం ఐదు జట్లుగా ఈ పోటీల్లో తలపడుతున్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఆహ్వాన నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: ముత్యాలమ్మ కళాపరిషత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9, 10, 11వ తేదీలలో ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ వ్యవస్థాపకులు కేశిరెడ్డి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బృందాలతో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

21న ధ్యాన దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని సత్యసాయి పెద్ద మందిరంలో ఈ నెల 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా విద్యా సంస్థ నిర్వాహకుడు, యోగా గురువు మావూరు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో యోగా గురువులు, అభ్యాసకులు, యోగాపై అవగాహన ఉన్న ప్రతిఒక్కరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. యోగా విశిష్టత, ఆవశ్యకతపై అభిప్రాయాలను వెల్లడించవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయినికి జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


భారతిని పరామర్శిస్తున్న పిరియా విజయ

కవిటి: పాఠశాలకు వెళ్లే దారిలో దుండగుడి దాడిలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయిని బల్లెడ భారతిని ఆర్.బైరిపురంలోని ఆమె నివాసంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పరామర్శించారు. దాడి జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వజ్జ ప్రసాదరావు, పుల్లట జగదీష్, పిరియా ఆనందరావు, యలమంచి నీలయ్య, మాదిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: బొర్ర పుట్టుగ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బల్లెడ భారతిని ఆర్.భైరిపురంలోని ఆమె నివాసంలో డీఈఓ ఎస్ తిరుమల చైతన్య పరామర్శించారు. ఆయన వెంట ఎంఈఓ ధనంజయ మజ్జి, సిబ్బంది సంతోష్, మండల ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి తదితరులు ఉన్నారు.

నౌపడ టీడీపీలో ఆధిపత్య పోరు


పెట్రోల్ బాటిల్ పట్టుకొని భైఠాయించిన టీడీపీ కార్యకర్త నగేష్, కుటుంబసభ్యులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ తెలుగుదేశం పార్టీలో ఎంపీపీ భర్త కర్రి విష్ణుమూర్తి, టీడీపీ నాయకుడు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి వర్గాల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. విష్ణుమూర్తి వర్గానికి చెందిన అనపాన నగేష్ నౌపడ వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంటి వద్ద మురుగుకాలువను కొందరు కప్పి వేయడంతో పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా సొంత పార్టీ నాయకుల వల్లే సమస్య పరిష్కారం కావడం లేదంటూ మంగళవారం నౌపడ గ్రామ సచివాలయం వద్ద నిరసనకు దిగారు. కుటుంబంతో సహా పెట్రోల్ బాటిల్ పట్టుకొని బైఠాయించారు. అయినా సిబ్బంది పట్టించుకోకుండా సచివాలయానికి తాళాలు వేసి వెళ్లిపోవడంతో కొంతసేపటి తర్వాత నగేష్ కూడా వెనుతిరిగారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో బుధవారం నుంచి ఈ నెల 23 వరకు జరగనున్న శాఖాపరమైన(డిపార్ట్‌మెంటల్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్లో పరీక్షల నిర్వహణపై మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్లలోని శ్రీశివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)కళాశాలల వేదికగా పరీక్షలు జరుగుతాయని వివరించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పరీక్షలకు 1831 మంది ఉద్యోగులు హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.అమ్మాజీ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీకాంత్, సీఐ దేవరకొండ ప్రసాద్, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లఘుచిత్ర పోటీల విజేతగా జి.సిగడాం మోడల్ స్కూల్


లఘుచిత్రంలో ఓ సన్నివేశం

జి.సిగడాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) నిర్వహించిన లఘు చిత్రం పోటీల్లో జి.సిగడాం మోడల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'పవర్ ప్రేమికుడు' అనే షార్ట్ ఫిల్మ్‌కు ప్రథమ బహుమతి దక్కిందని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లంక మంగళవారం తెలిపారు. విద్యుత్ ఎలా వాడాలి.. ఎలా పొదుపు చేయాలి అనే అంశంపై ఈ లఘుచిత్రాన్ని రూపొందించారు. ఈ నెల 20న విజయవాడలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకుంటారని పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులు వైకుంఠరావు, డోల వరప్రసాదరావు, ఈశ్వర్, తేజ నటించిన ఈ చిత్రం రూపొందించేందుకు తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు, షలీమ్ కృషి చేశారని తెలిపారు.

బూడిదే మిగిలింది!

- అంబటి ఎరుకువానిపేటలో వరి చేను దగ్ధం
- గత ఏడాది కూడా కాలిపోయిన కుప్పలు
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార: ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట కాలి బూడిద కావడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. గత ఏడాది కూడా ఇదే తరహాలో వరి పంట దగ్ధం కావడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గార మండలం అంపోలు పంచాయతీ అంబటి ఎరుకువానిపేట సమీపంలో వరి చేను దగ్ధమైంది. గ్రామానికి అంబటి రామదాసు, వాణిలకు చెందిన పొలంలో అల్లుడు బాన్న రమణ వరి సాగు చేశాడు. సోమవారం సాయంత్రం చేను నూర్పు చేసేందుకు పొలం నుంచి తీసుకొచ్చి స్థానిక రియల్ ఎస్టేట్ స్థలంలో ఉంచి మంగళవారం ఉదయం నూర్పు చేసేందుకు సిద్ధమయ్యాడు. రాత్రి చాలా సమయం అక్కడే ఉన్న రైతు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి మంటల్లో ఉన్న వరిచేను గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చాడు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ. 70 వేలు నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు చెబుతున్నాడు. గతంలో కూడా పంటపొలంలోనే వరికుప్పలు కాలిపోవడం, ఈ ఏడాది కూడా నూర్పుకి సిద్ధమైన చేను కాలిపోవడంతో అనుమానం వచ్చి బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రెల్ల జనార్దనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


కొత్తూరు: కాలిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో

కొత్తూరు: మండలంలోని బలద గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రమేష్ జగన్నాథపేట సమీపంలో వరిపంట సాగు చేశాడు. కష్టపడి పండించిన 30 బస్తాల ధాన్యం మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న వీఆర్వో రాజగోపాలరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యానికి నిప్పు పెట్టి ఉంటారని బాధిత రైతు అనుమానిస్తున్నారు.